11,062 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్

- విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఈ నెల 4 నుంచి దరఖాస్తులు
- సీబీటీ పద్ధతిలో పరీక్షల నిర్వహణ
- జూన్ లేదా జూలైలో పరీక్షలు
- మహిళలకు సమాంతర రిజర్వేషన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడుల్లో టీచర్ పోస్టుల భర్తీకి డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 11,062 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి విడుదల చేశారు. వీటిలో 6,508 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులుండగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,629, భాషా పండితులు 727, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)182 పోస్టులున్నాయి. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల్లో 220 స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులుండగా, 796 సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులున్నాయి. అభ్యర్థులు ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 3 వరకు డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకొనే వారు ఫీజుగా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు చెల్లింపు గడువు ఏప్రిల్ 2న ముగియనున్నది. వివరాలకు https://schooledu.telangana వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. కార్యక్రమంలో సీఎంవో సెక్రటరీ మాణిక్‌రాజ్ కన్నన్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తదితరులు ఉన్నారు.

సీబీటీ పద్ధతిలో పరీక్షలు..

డీఎస్సీ రాత పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో 11 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయి. జూన్, జూలైల్లో పరీక్షలను నిర్వహించే అవకాశం ఉన్నది. పార్లమెంట్ ఎన్నికలు, ఎప్‌సెట్, జేఈఈ, నీట్ వంటి పరీక్షల దృష్ట్యా పరీక్షలు ఆలస్యం కానున్నాయి. నిరుడు 5,089 పోస్టుల భర్తీకి కేసీఆర్ సర్కారు డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీచేసిన విషయం తెలిసిందే. దాన్ని రద్దుచేసి కొత్తగా నోటిఫికేషన్‌ను జారీచేయగా, అప్పట్లో దరఖాస్తు చేసినవారు తాజాగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఈ సారి మహిళలకు సమాంతర రిజర్వేషన్ల వర్తింపుతో డీఎస్సీకి దరఖాస్తుల సంఖ్య పెరగనున్నది. మరో 2 లక్షల దరఖాస్తులొస్తాయని అధికారులు అంచనా వేశారు. జిల్లాల వారీగా పోస్టుల వివరాలను మార్చి 4న విడుదల చేస్తారు.డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించడం పట్ల పీఆర్టీయూ టీఎస్ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు : పీఆర్టీయూ టీఎస్

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించడం పట్ల పీఆర్టీయూ టీఎస్ హర్షం వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. దీర్ఘకాలికంగా బడుల్లో సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని, ఈ డీఎస్సీ నోటిఫికేషన్‌తో విద్యారంగం మరింత బలోపేతమవుతుందని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అభిప్రాయపడ్డారు. టెట్ మినహాయింపు కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో అత్యధికం.. పెద్దపల్లిల్లో అత్యల్పం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రప్రభుత్వం భర్తీచేసే టీచర్ పోస్టుల్లో అత్యధికం హైదరాబాద్ జిల్లాలోనే ఉన్నాయి. అత్యధికంగా ఈ జిల్లాలోనే 878 పోస్టులున్నాయి. వీటిలో 537 పోస్టులు ఎస్‌జీటీలే ఉండటం విశేషం. నల్లగొండలో 605, నిజామాబాద్‌లో 601 చొప్పున పోస్టులున్నాయి. అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 93 పోస్టులే ఉన్నాయి. ఈ పోస్టుల్లో 49 స్కూల్ అసిస్టెంట్ పోస్టులుండగా, 21 ఎస్జీటీలున్నాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తున్నది. మొత్తం 1,016 పోస్టులను భర్తీ చేస్తుండగా, ఇవి నల్లగొండలో 60, రంగారెడ్డిలో 56, నాగర్‌కర్నూలులో 54 చొప్పున పోస్టులున్నాయి. వీటిని బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత ఉన్నవారితో భర్తీ చేస్తారు.

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు..

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	భాషా పండితులు	పీఈటీ	ఎస్జీటీ	ఎస్ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్)	ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	మొత్తం
హైదరాబాద్	158	113	31	537	06	33	878
నల్లగొండ	128	28	06	383	13	47	605
నిజామాబాద్	124	23	09	403	11	31	601
ఖమ్మం	176	18	10	334	08	29	575
సంగారెడ్డి	92	24	06	385	09	35	551
కామారెడ్డి	121	15	05	318	11	36	506
భద్రాద్రికొత్తగూడెం	129	10	01	268	08	31	447
సూర్యాపేట	86	23	05	224	11	37	386
మహబూబాబాద్	71	19	02	264	05	20	381
రంగారెడ్డి	61	30	06	226	10	46	379
వికారాబాద్	102	23	05	195	06	28	359
నిర్మల్	70	04	04	236	05	23	342
కుమ్రంభీం ఆసిఫాబాద్	62	25	02	234	03	15	341
జగిత్యాల	99	39	08	161	05	22	334
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
సిద్దిపేట	77	24	08	167	08	27	311
మెదక్	92	30	01	156	09	22	310
వరంగల్	66	21	06	182	05	21	301
మంచిర్యాల	70	16	03	176	05	18	288
నాగర్‌కర్నూల్	70	18	02	141	13	41	285
నారాయణపేట	73	23	01	161	05	16	279
యాదాద్రిభువనగిరి	84	21	02	137	10	23	277
కరీంనగర్	86	18	07	114	05	15	245
మహబూబ్‌నగర్	38	24	08	146	07	20	243
జయశంకర్ భూపాలపల్లి	41	20	07	152	04	13	237
జనగామ	50	21	07	118	05	20	221
ములుగు	33	16	01	125	03	14	192
హనుమకొండ	73	05	07	81	04	17	187
జోగులాంబ గద్వాల	35	28	08	80	04	17	172
వనపర్తి	57	09	06	56	05	19	152
రాజన్న సిరిసిల్ల	56	12	04	67	03	09	151
మేడ్చల్ -మల్కాజిగిరి	26	08	01	51	03	20	109
పెద్దపల్లి	49	05	01	21	05	12	93
మొత్తం	2,629	727	182	6,508	220	796	11,062

ప్రాణం తీసిన 'నిమిషం' నిబంధన

- సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోలేక ఆత్మహత్య
- సొత్నాల ప్రాజెక్టులో దూకి ఇంటర్ విద్యార్థి సూసైడ్
- ఘటనా స్థలంలో సూసైడ్ నోట్, రిస్ట్‌వాచ్ స్వాధీనం

జైనథ్, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షల హాజరు విషయంలో ప్రవేశపెట్టిన నిమిషం నిబంధన విద్యార్థులకు శాపంగా మారింది. నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోకపోవడంతో బుధవారం పరీక్షల ప్రారంభం రోజే కొందరు విద్యార్థులను అధికారులు పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. దీంతో ఏడాదంతా కష్టపడి చదివి పరీక్ష రాయలేకపోయామని కన్నీళ్లు పెట్టుకుంటూ నిరాశతో వెనుదిరిగితే.. గురువారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షకు ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థి ప్రాణాన్నే బలితీసుకున్నది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం మాంగూర్లకు చెందిన శివకుమార్(17) ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతనికి ఆదిలాబాద్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో సెంటర్ పడింది. గురువారం ఉదయం తెలుగు పరీక్ష రాయడానికి సొంతూరు నుంచి ఆటోలో 8.30 గంటలకు బయలుదేరాడు. ఆదిలాబాద్‌కు బస్టాండ్‌కు చేరుకునే సరికి 8.55 గంటలు అయింది. 9 గంటలకే పరీక్ష ఉండటంతో.. అక్కడి నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లే సరికి ఆలస్యం అవుతుందని తీవ్ర ఆందోళన చెందాడు. పరీక్ష రాయలేకపోయాననే మనస్తాపంతో వెనుదిరిగి సొత్నాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాజెక్టు వద్ద సూసైడ్ నోట్, రిస్ట్ వాచ్, ఇతర వస్తువులు లభించాయి. ఇంటర్ పరీక్ష రాయకపోవడం చాలా బాధగా ఉందంటూ తండ్రి రాముని ఉద్దేశించి సూసైడ్ నోట్ రాసి ఉంచాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజఈతగాళ్ల సహాయంతో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లి టేకం పంచపుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పురుషోత్తం తెలిపారు. టేకం పంచపుల–రాము దంపతులకు ఇద్దరు కుమారులు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు తల్లిదండ్రుల తోపాటే కూలిపని చేస్తుండగా.. బాగా చదువుకుని ప్రయోజకుడవుతాడనుకున్న రెండో కుమారుడు ఇలా అఘాయిత్యానికి పాల్పడటంపై తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు

- అధికారులకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం
- ఇంటర్ పరీక్షల నిర్వహణపై బుర్రా వెంకటేశం సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ పరీక్షాకేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న నేపథ్యంలో గురువారం ఆయన ఆ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు, నోడల్ అధికారులు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఒత్తిడిని నివారించాలని, టెలిమానస్ హెల్ప్‌లైన్ల నంబర్లకు విస్తృత ప్రాచుర్యం కల్పించాలని సూచించారు. విద్యార్థులు సాధ్యమైనంత త్వరగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఏవైనా సమస్యలుంటే.. జిల్లా, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలన్నారు. సమీక్షలో ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతిఓజా, పరీక్షల విభాగం కంట్రోలర్ జయప్రదా బాయి.. పరీక్షల విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2.87 శాతం గైర్హాజరు..

సెకండియర్ విద్యార్థులకు రెండో భాష పేపర్ –2 పరీక్ష గురువారం నిర్వహించారు. మొత్తం 4,55,536 మంది విద్యార్థులకు 4,42,451 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. దీంతో 13,085 (2.87శాతం) విద్యార్థులు పరీక్ష రాయలేదు. పలు జిల్లాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శృతిఓజా వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా, అధికారులు గుర్తించి సంబంధిత విద్యార్థిపై చర్యలు తీసుకొన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- పోస్టులను 25 వేలకు పెంచాలి
- టెట్ తక్షణమే నిర్వహించాలి
- నిరుద్యోగ జేఏసీ నేతల డిమాండ్
- డీఎస్ఈ కార్యాలయం ముట్టడి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని.. దగా డీఎస్సీ అని నిరుద్యోగ జేఏసీ నేతలు ఆరోపించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరుద్యోగ జేఏసీ నేతలు, టీచర్ అభ్యర్థులు గురువారం హైదరాబాద్ సైఫాబాద్‌లోని విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం కమిషనర్ శ్రీదేవసేనకు వినతిపత్రం ఇచ్చారు. 25 వేల టీచర్ పోస్టులతోపాటు 15 వేల అటెండర్, స్వీపర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ ముట్టడిలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ టెట్ నిర్వహణకు ఉన్న అభ్యంతరమేంటని ప్రశ్నించారు. గతంలో 10 నుంచి 15 శాతం లోపే అభ్యర్థులు టెట్‌లో పాసయ్యారని గుర్తుచేశారు. డీఎస్సీ, టెట్ ఒకేసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీలో ఐఈఆర్పీలకు 30 శాతం వెయిటేజీనని ఇవ్వాలని స్పెషల్ ఎడ్యుకేటర్స్ ఫోరం జాతీయ కన్వీనర్ కల్పగిరి శ్రీను ఒక ప్రకటనలో కోరారు.

తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపే కుట్ర

బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బ తీసేందుకు చంద్రబాబు ప్రియశిష్యుడు రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో కలపాలని కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ బుధవారం ప్రకటనలో ఆరోపించారు. కాళేశ్వరాన్ని నిరుపయోగంగా చేయడం ద్వారా ఇక్కడి ప్రజలు తిరిగి ఆంధ్రాపై ఆధారపడే పరిస్థితులు తీసుకురావాలన్న దూరదృష్టితోనే సీఎం రేవంత్ నడుచుకుంటున్నారని పేర్కొన్నారు.

రిటైర్డు అధికారుల తొలగింపుపై కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): వివిధ శాఖల్లో పనిచేస్తున్న రిటైర్డు అధికారులను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. అన్ని శాఖల్లో కలిపి సుమారు 1,050 మంది ఉన్నట్టు ఇప్పటికే ప్రభుత్వం గుర్తించింది. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్న వారిని విధుల్లో కొనసాగించాలని, వారి అనుభవాన్ని పరిపాలనలో ఉపయోగించుకోవాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. అందుకే అందరి పనితీరు, వారిపై వచ్చిన ఆరోపణలు, అవినీతి, అక్రమాలపై ఇంటెలిజెన్స్ నుంచి పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్నట్టు తెలిసింది. అయితే రిటైర్డ్ అధికారుల వల్ల తమకు పదోన్నతులు లభించడం లేదని వివిధ శాఖల్లోని అధికారులు, ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. వీరి వల్ల పదోన్నతి పొందలేక ఇప్పటికే ఎందరో రిటైర్డ్ అయినట్టు పలువురు వాపోతున్నారు.

అభయహస్తం మ్యానిఫెస్టో (జాబ్ క్యాలెండర్) ఇలా...

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్పెషల్ డిపార్ట్‌మెంట్ నియామకాలు కమిషన్ ద్వారా చేపట్టబడతాయి. దరఖాస్తుదారులు ఎవ్వరు ఒక రూపాయి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

వాస్తవంగా జరుగుతున్నది ఇలా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా 563 ఉద్యోగాల భర్తీకి గ్రూప్ –1 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గ్రూప్ –1కు నిరుద్యోగులు అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజుగా రూ. 200, పరీక్ష ఫీజుగా రూ. 120 చెల్లించాలి.

డీఎస్సీ పోస్టుకు వెయ్యి ఫీజు

తాజాగా గురువారం 11,062 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. డీఎస్సీకి దరఖాస్తు చేసే అభ్యర్థులు వెయ్యి రూపాయలు ఫీజుగా చెల్లించాలని సూచించారు. ఎన్ని పోస్టులకు దరఖాస్తు చేస్తే అభ్యర్థి అన్ని వేల రూపాయలు ఫీజుగా చెల్లించాలి.

ఉదాహరణకు – ఒక అభ్యర్థి స్కూల్ అసిస్టెంట్ గణితం, ఫిజికల్ సైన్స్ రెండు పోస్టులకు దరఖాస్తు చేస్తే రెండువేలు ఫీజుగా సమర్పించుకోవాల్సిందే. ఇలా అర్హత ఉండి ఎన్ని పోస్టులకు దరఖాస్తు చేస్తే అన్ని వేలను చెల్లించాల్సిందే.

'మెగా' పేరు దగా తీరు!

> మొదటిపేజీ తరువాయి...

తీసుకోబోమని ఏకంగా అభయహస్తం మ్యానిఫెస్టోలో ఆ పార్టీ పొందుపరిచింది. కానీ, ఈ హామీని పూర్తిగా పక్కనపెట్టేసింది. ఇటీవలే విడుదలైన గ్రూప్ –1, తాజాగా విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్లలో ఎక్కడా ఫీజు మినహాయింపు ఇవ్వలేదు. నిరుద్యోగుల భావోద్వేగాలను, వారి బలహీనతలను ఆసరాగా చేసుకొని అధికారంలోకి వచ్చి ఇప్పుడేమో ఇచ్చిన హామీల ఊసేలేకుండా నిరుద్యోగుల నుంచి ఫీజులు గుంజుతున్నది. రేవంత్ సర్కారు తీరుపట్ల నిరుద్యోగ యువత మండిపడుతున్నది. తాము నమ్మి ఓట్లేస్తే తమను నట్టేటముంచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. సీఎం సారు ఇదేంటని ప్రశ్నిస్తున్నది. ప్రజాపాలన అంటే ఇదేనా? అని నిలదీస్తున్నది. ఉద్యోగాల భర్తీ యేమో గాని.. మా జేబులకు చిల్లులుపెడతారా అంటూ ప్రశ్నలవర్షం కురిపిస్తున్నది. తమను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతామని హెచ్చరిస్తున్నది.

రద్దుచేస్తామని వెయ్యి తీసుకోవడం దారుణం

పరీక్ష ఫీజులను పూర్తిగా రద్దు చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఇప్పుడా ఆ హామీని విస్మరించడం అత్యంత దారుణం. పైగా నిరుద్యోగుల నుంచి రూ.వెయ్యి వసూలు చేయడం సరికాదు. ప్రభుత్వం ఫీజులపై పునరాలోచించాలి. త్వరలో రిటైరయ్యే 4 వేల టీచర్ పోస్టులను కూడా డీఎస్సీలో జతచేయాలి. గ్రూప్ –1 తర్వాతే డీఎస్సీ పరీక్ష నిర్వహించాలి.

- రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రెండో అభ్యర్థికీ న్యాయం చేయాలి

సీఎంకు ఎమ్మెల్సీ దేశపతి విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): గురుకుల జేఎల్, పీఈటీ పోస్టులు మిగిలిపోకుండా 1:2లో మిగిలిన అభ్యర్థికి ఉద్యోగ కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కోరారు. పోస్టులు మిగిలిపోకుండా రిలింకిష్‌మెంట్ సిస్టమ్‌తో 1:2లోని రెండో అభ్యర్థి నియామకం అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పోస్టులు పెంచండి.. '2008' బాధితుల కన్నీళ్లు తుడవండి

సీఎంకు ఆర్ఎస్ ప్రవీణ్ విన్నపం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : మెగా డీఎస్సీ నోటిఫికేషన్ చాలా మంది బీఎడ్ అభ్యర్థులకు నిరాశ మిగిల్చిందని బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. వెంటనే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు. 2008 డీఎస్సీ బాధితులకు ఉద్యోగాలిచ్చి వాళ్ళ కన్నీళ్లు తుడవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దాదాపు 4 లక్షల మంది ఆశావహులుంటే 2,692 ఎస్ఏ పోస్టులు ప్రకటించడం అన్యాయమని తెలిపారు. ఎస్జీటీ నుంచి ఎస్ఏకు ప్రమోషన్ సర్వీస్ రూల్స్ మార్చాలని కోరారు. టెట్ నిర్వహించాలని, పాఠశాలల్లో మానసిక నిపుణులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో అవరోహణ క్రమంలో రిక్రూట్‌మెంట్ ప్రకటన చేయాలని కోరారు.

నేటి నుంచి ధరణి స్పెషల్ డ్రైవ్

- 9 నాటికి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం
- ప్రతి మండలంలో ప్రత్యేక బృందాలు
- ఆర్డీవోలు, తహసీల్దార్లకూ పరిష్కార బాధ్యతలు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. ధరణి కమిటీ ఈ నెల 24న సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన సందర్భంగా ఇచ్చిన సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. పరిష్కారమైన తర్వాత దరఖాస్తుదారులకు గ్రామస్థాయి అధికారి ద్వారా గానీ, వాట్సాప్, ఫోన్ మెసేజ్ ద్వారా గానీ సమాచారం అందిస్తారు. 2.5 లక్షల పెండింగ్ దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం.

తాజా మార్గదర్శకాలు ఇవే..

- స్పెషల్ డ్రైవ్ శుక్రవారం ప్రారంభమై ఈ నెల 9న ముగుస్తుంది.
- ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలి.
- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్త పడాలి.
- టీఎం 3, 4, 7, 10, 14, 15, 16, 20, 22, 23, 24, 26, 31, 32, 33, కే అండ్ ఎల్ ఫారం దరఖాస్తులను పరిష్కరిస్తారు.
- ప్రతి మండలంలో రెండు, మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తారు. దీనికి తహసీల్దార్/డిప్యూటీ తహసీల్దార్/రెవెన్యూ ఇన్స్పెక్టర్ నేతృత్వం వహిస్తారు.
- ప్రత్యేక బృందాల్లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితోపాటు డీఆర్‌డీఏలోని కమ్యూనిటీ సర్వేయర్లు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శుల సహాయం తీసుకుంటారు.
- దరఖాస్తు, డాక్యుమెంట్లను పరిశీలించి సేత్వార్, ఖాస్రా పహాణీ, సేస్సాలా పహాణీ, పాత పహాణీలు, 1బీ రిజిస్టర్‌తో పోల్చి చూడాలి. అవసరమైతే అసైన్‌మెంట్, ఇనాం, పీవోటీ, భూదాన్, వక్ఫ్, ఎండోమెంట్స్ రికార్డులనూ పరిశీలించాలి.
- అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి అంగీకరించాలో, తిరస్కరించాలో సూచిస్తూ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నివేదికలను తహసీల్దార్ పరిశీలించి పైఅధికారులకు పంపుతారు. అప్రూవింగ్ అథారిటీ వాటిని పరిశీలించి నిర్ధారణ చేయాలి.
- జిల్లాలవారీగా పురోగతిని సీసీఎల్ఏ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

ఆర్డీవోలు, తహసీల్దార్లకూ అధికారాలు

ఇప్పటివరకు దరఖాస్తుల పరిష్కార అధికారం కలెక్టర్లకే ఉండేది. స్పెషల్ డ్రైవ్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లకూ కొన్ని అధికారాలను కట్టబెట్టారు. తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ వరకు ఏయే స్థాయిలో ఏయే మాడ్యూళ్ల కింద దరఖాస్తులను పరిష్కరించాలో స్పష్టంగా పేర్కొన్నారు. కిందిస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి నివేదిక తెప్పించుకోవాలని స్పష్టం చేశారు. పత్రాలు, రికార్డులతోపాటు నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అప్రూవ్/రిజెక్ట్‌గా నిర్ధారణ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే కచ్చితంగా సరైన కారణాన్ని వివరించాల్సి ఉంటుంది. తహసీల్దార్ పరిధిలో 7 రోజుల్లోగా, ఆర్డీవోలు 3 రోజుల్లోగా, అదపు కలెక్టర్లు 3 రోజుల్లోగా, కలెక్టర్లు 7 రోజుల్లోగా దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

- ఆర్డీవోలకు టీఎం 7, 16, 20, 22, 26, 33 మాడ్యూళ్ల కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కార బాధ్యతలు అప్పగించారు. టీఎం 33 కింద వచ్చిన వాటిలో మిస్సింగ్ సర్వే నంబర్, సబ్ డివిజన్ నంబర్, విస్తీర్ణంలో మార్పులు (రూ.5 లక్షలలోపు విలువైన భూములు) చేసే అధికారాన్ని కట్టబెట్టారు.
- తహసీల్దార్లకు టీఎం 4, 10, 14, 32 మాడ్యూల్ దరఖాస్తుల నిర్ణయాధికారం, మార్పులు, చేర్పుల అధికారం ఉంది.

కే, ఎల్ ఫారాలకు.. కలెక్టర్ పరిష్కారం

కలెక్టర్ స్థాయిలో కే అండ్ ఎల్ ఫారం దరఖాస్తులను పరిష్కరిస్తారు. వీటిని ముందుగా ఆర్డీవోలకు పంపాల్సి ఉంటుంది. వారు రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి నివేదిక తెప్పించుకోవ